
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5
సిద్దిపేట
మంగళవారం 27 ఆగస్టు 2024


చేర్యాల : మల్లన్న ఆలయంలో ఉట్టి కొడుతున్న ఒగ్గుపూజారులు

కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొట్టిన జగ్గారెడ్డి


సంగారెడ్డిలోని రామ్‌మందిర్ వద్ద కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి


కృష్ణాష్టమి వేడుకల్లో డోలక్ వాయిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- వరుస చోరీలతో బెంబేలు
- పగలు.. రాత్రి దొంగతనాలు
- పని చేయని సీసీ కెమెరాలు
- భయాందోళనలో ప్రజలు

రెండు రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో గ్రౌండ్ ఫ్లోర్, మూడో అంతస్తులో తాళం వేసిన ఇళ్లలో పట్టపగలే దొంగలుపడ్డారు. తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న 8 తులాల బంగారు, 60 తులాల వెండి ఆభరణాలు, రూ.15,000 నగదు, మరో ఇంట్లో రూ.2లక్షల నగదును తస్కరించారు...

వారం రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలోని శంకర్ నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి అశోక్‌కుమార్ ఇంటికి తాళం వేసి బెంగళూర్‌లోని తన కూతురు వద్దకు వెళ్లారు. మూడు రోజుల తరువాత తిరిగి వచ్చేసరికి ఇల్లు తాళం పగలగొట్టి ఉన్నది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న తులంనరా బంగారు ఆభరణాలు, రూ.40 వేలు నగదు కనిపించలేదు...


సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ముసుగు దొంగల సీసీ పుటేజీ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 26 : సిద్దిపేట జిల్లా కేంద్రంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. పోలీసుల దృష్టికి వచ్చినవి కొన్ని అయితే, రానివి చాలా సంఘటనలు ఉన్నాయి. కొంతమంది దొంగతనం జరిగినా పోలీసులకు ఫిర్యాదు చేస్తే కోర్టుల వెంబడి తిరగాల్సి వస్తుందని వెనుకడుగు వేస్తున్నారు. ఫలితంగా సిద్దిపేట పట్టణంలో నిత్యం ఎక్కడో ఒక చోట దొంగతనం జరుగుతూనే ఉంది.

పగలు గమనించి..

ఎక్కువ శాతం తాళం వేసిన ఇండ్లలోనే చోరీలు జరుగుతున్నాయి. దుండగులు పగటి పూట కాలనీలలో తిరుగుతూ తాళం వేసిన ఇండ్లను గమనిస్తున్నారు. అనంతరం పథకం ప్రకారం రాత్రిపూట ముసుగులో వెళ్లి వారి వద్ద ఉన్న రాడ్‌లతో టెక్నిక్‌గా తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి దోచుకెళ్తున్నారు. చోరీలను నివారించడానికి పోలీసులు బ్లూ కోల్ట్స్ సిబ్బందితో రాత్రి పూటగస్తీ నిర్వహిస్తున్నా దొంగలు మాత్రం దొరకడం లేదు.

పట్టణంలో పని చేయని సీసీ కెమెరాలు

గత ప్రభుత్వం హయాంలో సిద్దిపేటలో దొంగతనాల నివారణకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా నేను సైతం అనే కార్యక్రమం ద్వారా సుమారు 6 వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రతి కాలనీలో చౌరస్తాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. అవి కొన్ని రోజులు బాగానే పని చేశాయి. కొంతకాలంగా అవి గాలివానకు పాడైపోయాయి. పోలీస్ డిపార్ట్మెంట్‌లో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయించి సీసీ కెమెరాలు రిపేరు చేసేవారు. ప్రస్తుతం సిద్దిపేట పట్టణంలో ఉన్న సీసీ కెమెరాల్లో 50 శాతం పనిచేయడం లేదు. ఎక్కడైనా నేరం జరిగినప్పుడు ఆ పరిసర ప్రాంతంలో పోలీసులు సీసీ కెమెరాలను పర్యవేక్షించినప్పుడు పని చేయకపోవడంతో తల పట్టుకుంటున్నారు.

అర్ధరాత్రి సంచారం

సిద్దిపేటలో వారం క్రితం అర్ధరాత్రి ఐదుగురు సభ్యులతో కూడిన దొంగల ముఠా పలు కాలనీల్లో సంచరిస్తున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. పట్టణంలోని ప్రశాంత్‌నగర్, సీతారాంనగర్ కాలనీల్లో ఈ నెల 14న అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో దొంగలు సంచరిస్తున్నట్లు ఇళ్ల ముందు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డైన వీడియో వెలుగులోకి వచ్చింది. ఈ వీడియో సోషల్ మీడియాలో తిరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ మరింత పకడ్బందీగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బీరువా తలుపులు పగలగొట్టిన దొంగలు
ఓ ఇంట్లో చిందరవందరగా పడిన వస్తువులు (ఫైల్)

కార్డెన్ సెర్చ్...

- 28 మోటారు సైకిళ్లు, కారు, ఆటో సీజ్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 26 : సిద్దిపేటలోని పలు కాలనీల్లో ఏసీపీ మధు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందిరమ్మకాలనీలో ఎలాంటి పేపర్లు లేని 11 మోటార్ సైకిళ్లు, కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో 17 మోటార్ సైకిళ్లు, ఒక కారు, ఆటో సీజ్ చేశారు. రూ.5,000 విలువ చేసే గుట్కాలు, బెల్టుషాపుల్లో రూ.4,000 విలువగల లిక్కర్‌ను సీజ్ చేశారు. నార్కొటిక్స్ డాగ్స్‌తో అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ కాలనీలు, గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద వస్తులు కనబడితే సమాచారం అందించాలన్నారు. గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు నరసింహారావు, కనకయ్య, ఆసిఫ్, అపూర్వరెడ్డి, రాజేష్, హరీష్, పరుశురామ్, ఆర్ఎస్ఐలు రోహిత్, బాలకృష్ణ, వెంకటరమణ, అంజయ్య, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా తనిఖీలు

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 62 మంది వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా అదుపులోకి తీసుకొని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు, ఇతర ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై 350 కేసులు నమోదు చేశారు. అనుమానాస్పదంగా ఉన్న 225 మంది వ్యక్తులపై ఫింగర్ ప్రింట్ డ్రైవ్ ద్వారా తనిఖీ చేశారు.


పోలీసులు సీజ్ చేసిన వాహనాలు



సిద్దిపేటలో


సిద్దిపేట: వేడుకల్లో భక్తజనం

గోపాల... గోపాల..

మల్లన్న సన్నిధిలో కిట్టయ్య వేడుకలు

సిద్దిపేట జిల్లావ్యాప్తంగా సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగావైభవంగా జరిగాయి. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని పలు ఆలయాలుస్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులతో దేవాలయాలు కిటకిటలాడాయి. ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో కృష్ణాష్టమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, ఉట్లు కొట్టడం, పెద్దపట్నం వేయడం వంటి కార్యక్రమాలు చేపట్టారు.


ప్రత్యేక అలంకరణలో మురళీకృష్ణుడు

వీధికుక్కల దాడిలో చిన్నారికి తీవ్రగాయాలు


అనుషిత(ఫైల్)

మిరుదొడ్డి, ఆగస్టు26: వీధికుక్కల దాడిలో చిన్నారికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం బేగంపేటలో చోటుచేసుకున్నది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అన్నమైన దేవేందర్, లాస్య దంపతుల కుతూరు అనుషిత (2) ఇంటిఎదుట ఆడుకుంటున్నది. ఇంతలోనే పాపపై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడిచేసి లాక్కెళ్తుండగా గమనించిన తల్లిదండ్రులు, స్థానికులు కుక్కలను తరిమికొట్టి రక్షించారు. తీవ్రగాయాపాలైన చిన్నారిని 108 వాహనంలో మొదట స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్నారి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. కుక్కల బెడదను తగ్గించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొండచిలువతో కలకలం..

గ్రామస్థుల చేతుల్లో హతం



మండలంలోని బస్వాపూర్ గ్రామంలో సోమవారం జనవాసాల మధ్య భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన మంద చంద్రమౌళి ఇంటి వద్ద కొండచిలువ ప్రత్యక్షం కావడంతో పిల్లలతో పాటు పెద్దలు భయాందోళనకు గురయ్యారు. గ్రామస్తులు కలిసి కొండచిలువను హతమార్చారు. గ్రామంలోని ఇండ్ల మధ్య చెట్ల పొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో తరచూ పాములు, విషసర్పాలు వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

-కోహెడ, ఆగస్టు 26


జ్వరపీడితులతో కిక్కిరిసి పోయిన హుస్నాబాద్ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం

జ్వరబాధితుల బారులు..

హుస్నాబాద్ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం సోమవారం జ్వరపీడితులతో కిక్కిరిసిపోయింది. వైద్య పరీక్షల కోసం బాధితులు బారులు తీరారు. ఆసుపత్రికి దాదాపు 350 మంది రాగా, ఇందులో 233 మంది జ్వరాలతో బాధపడుతున్నవారే. 40 మందికి తీవ్రజ్వరాలు ఉండటంతో చికిత్స అందిస్తున్నారు.

-హుస్నాబాద్, ఆగస్టు 26

108 అంబులెన్స్ మొరాయింపు

జిల్లాలోనే అత్యధికంగా 4.25 లక్షల కిలో మీటర్లు తిరిగిన వాహనం

దౌల్తాబాద్, ఆగస్టు26: దౌల్తాబాద్ మండలంలోని 108 అంబులెన్స్ పాతబడడంతో 108 సిబ్బంది వెనక నుంచి తోస్తేనే స్టార్ట్ అవుతుంది. దీంతో 108 అంబులెన్స్ అత్యవసర సేవలు అందించాలంటే సిబ్బందికి తిప్పలు తప్పడంలేదు. ఈ 108 అంబులెన్స్ జిల్లాలోనే అత్యదికంగా 4,లక్షల 25 వేల కిలో మీటర్లు తిరగడం గమన్హారం. 108 పాతబడడంతో 108 అంబులెన్స్ ప్రతీ సారి మొరాయించడంతో అత్యవసర సంఘటనలు జరిగినప్పుడు సేవలు అందించడంలో అలస్యం అవుతుంది. సిబ్బంది కొత్త 108 వాహనం కావాలని ఎన్నిసార్లు పై అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించడం లేదని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దౌల్తాబాద్ మండలానికి నూతన 108 అంబులెన్స్ అందించి అత్యవసర సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడి మెరుగైనా సేవలు అందించాలని ప్రజలు, సిబ్బంది కొరుతున్నారు.



బైరాన్‌పల్లి నెత్తుటిగాథకు 77 ఏండ్లు

- నాడు రజాకార్లపై ధిక్కార స్వరం
- పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

ధూళిమిట్ట,ఆగస్టు 26: వీర బైరాన్‌పల్లి.. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన నేల. రజాకార్లు గ్రామాలపై పడి ధన, మాన, ప్రాణాలను దోచుకుంటూ రాక్షస క్రీడలను కొనసాగిస్తున్న రోజులవి.. వారి ఆగడాలకు ఎదురొడ్డి పోరాడేందుకు యువకులంతా కలిసి గ్రామ రక్షక దళంగా ఏర్పడ్డారు.ధూళిమిట్ట, కూటిగల్, లింగాపూర్, బైరాన్‌పల్లి గ్రామాల రక్షక దళాలు బైరాన్‌పల్లి గ్రామాన్ని ముఖ్యకేంద్రంగా చేసుకొని రజాకార్ల ఆగడాలను తిప్పికొట్టసాగారు. బైరాన్‌పల్లిలో ఇమ్మడి రాజిరెడ్డి, దుబ్బూరి రామిరెడ్డి, మోటం రామయ్యలాంటి యువకులు గ్రామరక్షణ దళాలు ఏర్పాటుచేసి ప్రభుత్వానికి పన్నులు కట్టడం మానేశారు. దొరలపై ధిక్కార స్వరం వినిపించి గ్రామమంతా ఒక్కతాటిపై నిలిచేలా చేశారు. తమ పొరుగు గ్రామమైన లింగాపూర్‌పై రజాకార్లు దాడి చేసి ధాన్యాన్ని ఎత్తుకెళుతున్న క్రమంలో బైరాన్‌పల్లి గ్రామరక్షక దళం నాయకులు, గ్రామస్తులంతా ఏకమై గొడ్డళ్లు, బరిసెలు, ఒడిసెలతో ఎదురుదాడికి దిగారు. దీంతో కక్షకట్టిన రజాకార్లు బైరాన్‌పల్లి గ్రామంలో విధ్వంసం సృష్టించాలని నిర్ణయానికి వచ్చి 1948 మే నెలలో 60 మంది రజాకార్లు తుపాకులతో బైరాన్‌పల్లిపై దాడికి ప్రయత్నించి విఫలమయ్యారు. రెండవసారి 150 మంది రజాకార్లు గ్రామంపై దాడికి దిగి ఓటమి చవిచూశారు. దీంతో గ్రామంపై తీవ్రమైన ప్రతీకారం పెంచుకున్న రజాకార్లు బైరాన్‌పల్లిపై ఏ క్షణమైనా దాడికి పాల్పడే అవకాశమందనే అనుమానంతో గ్రామం నడిబొడ్డున ఎత్తైన బురుజును రక్షణ స్థావరంగా ఏర్పర్చుకున్నారు.

పంజా విసిరిన ముష్కర మూకలు..

నిజాం సైన్యాధ్యక్షుడు ఖాసీం రజ్వీ నాయకత్వంలోని రజాకారు సైన్యం 1948 ఆగస్టు 27న దాడి జరిగి నేటికి 77 ఏళ్లు. రజాకార్లు, పోలీసులు, నిజాం సైన్యం సాయంతో 1200 మంది భారీ మందుగుండు సామగ్రి, తుపాకులతో బైరాన్‌పల్లి గ్రామంపై దాడికి దిగారు. ఊరు పొలిమేరలో కాపలాగా ఉండి



రజాకార్ల కదలికలను గ్రామ రక్షక దళాలకు అందించే విశ్వనాథ్‌భట్‌జోషిని పట్టుకొని బంధించారు. ఉదయం 4 గంటలకు బహిర్భుమికి వెళ్లిన ఉల్లెంగల వెంకటనర్సయ్యను అదుపులోకి తీసుకొని గ్రామంలోకి తీసుకొస్తుండంగా ఆయన తప్పించుకొని ఊరులోకి పరుగుపెట్టాడు. వెంటనే నగారా మోగించి గ్రామంలోకి రజాకార్లు చొరబడ్డారు అంటూ ప్రజలను అప్రమత్తం చేశాడు. దీంతో జనమంతా గ్రామ బురుజు పైకి వెళ్లి తలదాచుకోగా.. వారికి రక్షణగా గ్రామ రక్షణ దళాలు నిలిచాయి. బురుజుపై నుంచి రజాకార్ల పైకి కాల్పులు జరిపారు. వేకువజామున గ్రామంలో తుపాకీ మోతలతో ఊరంతా ఒక్కసారిగా ఉలిక్కి పడింది. బురుజుపై కాపలాగా ఉన్న మోటం రామయ్యమోటం పోచయ్య, బలిజ భూమయ్య నిద్ర మత్తు వదిలించుకునేలోపే రజాకార్ల తపాకీ గుండ్లకు బలయ్యారు.పిరంగుల నుంచి వచ్చి పడ్డ నిప్పు రవ్వలతో బురుజుపై నిల్వ చేసిన మందు గుండు సామగ్రి పూర్తిగా కాలిపోయింది. గ్రామంలోకి ప్రవేశించిన రజాకార్లు దొరికినవారిని దొరికినట్లుగా మట్టుబెట్టారు. గ్రామం వెలుపల శవాల చుట్టూ మహిళలను వివస్త్రాలను చేసి బతుకమ్మ ఆడించిన రజాకార్ల పైశాచిక ఆనందం నేటికీ వారి మనస్సుల్లో మానని గాయంగానే మిగిలిపోయింది. అంతటితో ఆగకుండా రజాకార్లు ఇంటింటికీ తిరిగి 92 మందిని పట్టుకొని పెడరెక్కలు విరిచి జోడుగా లెంకలు కట్టి వరుసగా నిలబెట్టి కాల్చారు. ఈ దాడుల్లో మొత్తం 118 మంది అమాయకులు బలికాగా, 25 మంది రజాకార్లు చనిపోయినట్లు రికార్డుల్లో ఉంది. కూటిగల్ గ్రామంలో రజాకార్లు దాడులు చేసి దాదాపు 30 మందిని పోట్టన పెట్టుకున్నారు. బైరాన్‌పల్లి పోరాటస్ఫూర్తితోనే హైదరాబాద్ సంస్థానంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉధృతంగా సాగింది. భారత సర్కార్ నిజాం ప్రభుత్వంపై సైనిక చర్యకు దిగేందుకు సిద్ధం కాగా నిజాం ప్రభువు దిగివచ్చి అఖండ భారతదేశంలో హైదరాబాద్ సంస్థానాన్ని వీలినం చేయడం జరిగింది.

బైరాన్‌పల్లి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి..

రజాకార్లకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసిన అమరులు, సమరయోధులను పాలకులు నిర్లక్ష్యం చేశారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. జలియన్‌వాలాబాగ్ దురాగాతాన్ని మించిన బైరాన్‌పల్లి పోరాటాన్ని భవిష్యత్ తరాలకు తెలిసే విధంగా పోరాట ఘట్టాన్ని పాఠ్యాంశాల్లో చేర్చడంతోపాటు గ్రామంలో స్మృతివనం ఏర్పాటుచేసి పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు. బైరాన్‌పల్లిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్న పాలకుల హామీలు అమలుకావడం లేదని ఆవేదనం వ్యక్తం చేస్తున్నారు. రు.1.10 కోట్ల వ్యయంతో బురుజు చుట్టూ ప్రహరీతో పాటు ఒక వాచ్‌టవర్, కమ్యూనిటీహాల్ నిర్మాణం, అమరవీరుల స్థూపం నుంచి బురుజు వరకు స్మృతివనం ఏర్పాటు ఓ కలగానే మిగిలిపోయిందని ప్రజలు వాపోతున్నారు. అమరవీరుల విగ్రహాల ఏర్పాటునూ విస్మరించడం శోచనీయమని, ఇప్పటికైనా పాలకులు స్పందించి బైరాన్‌పల్లిని పర్యాటకంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.


బైరాన్‌పల్లి గ్రామంలోని బురుజు...



శివలింగానికి 41 వేల లీటర్ల

పంచామృత, రుద్రాభిషేకాలు

● 41వేల బిల్వ పత్రాలతో పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

మెదక్ కల్చర్, ఆగస్టు 26: మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లిలో కోయ్యగుట్ట మల్లికార్జునస్వామి ఆలయానికి సోమవారం భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే శివలింగానికి 41 లీటర్ల పంచామృత, రుద్రాభిషేకాలు నిర్వహించారు. 41 వేల బిల్వపత్రాలతో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మల్లికార్జున్ పంతులు, భక్తులు, శబరి మాత భజన మండలి బృందం తదితరులు పాల్గొన్నారు.

వానలు కురవాలని పూజలు


బండమీది పాశం తింటున్న భక్తులు

వెల్దుర్తి, ఆగస్టు 26: వర్షాలు సమృద్ధిగా కురవాలని మండల పరిధిలోని బస్వాపూర్ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం నాలుగోసోమవారం సందర్భంగా ఆలయంలోని శివలింగానికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం వానలు కురవాలన ఆచారం ప్రకారం బెల్లంతో చేసిన పాశంను బండపై ఉంచి భక్తులు భక్తిశ్రద్ధలతో ఆరగించారు.


వెల్దుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నిధులు ఆపేసి కక్ష సాధింపు

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్/వెల్దుర్తి, ఆగస్టు 26: నర్సాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఆయాశాఖల మంత్రులకు విన్నవిస్తే నిధులు మంజూరు చేయడం లేదు. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కూడా ఆపేసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఆమె స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా మంజూరు చేసిన ఎస్‌డీఎఫ్ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపి వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆర్అండ్‌బీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కూడా రద్దు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా ఈ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేటాయించకుండా వివక్ష చూపుతుందని విమర్శించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నయిం, నాయకులు ప్రసాద్, రాజేశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు. వెల్దుర్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాసాయిపేట, వెల్దుర్తి మండలాలకు చెందిన 47మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ తరఫున నిలబడే అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మాసాయిపేట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సొసైటీ ఛైర్మన్ అనంతరెడ్డి, మాజీ జడ్పీటీసీ రమేష్‌గౌడ్, నాయకులు, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో రెండు ఇళ్లలో చోరీ

● 18 తులాల వెండి పట్టీలు, రూ.20వేల నగదు అపహరణ

నర్సాపూర్, ఆగస్టు 26: నర్సాపూర్ మండలంలోని గొల్లపల్లిలో ఆదివారం అర్ధరాత్రి తాళం వేసిన రెండు ఇళ్లలో దొంగలు పడి 18 తులాల వెండి పట్టీలు, రూ.20వేల నగదు అపహరించారు. సోమవారం సాయంత్రం ఎస్ఐ లింగం వివరాలను వెల్లడించారు. గొల్లపల్లికి చెందిన ఎర్రగొళ్ల ముత్యాలు, భర్త రాములు ఆదివారం బంధువుల ఫంక్షన్‌కు వెళ్లారు. అర్ధరాత్రి దాటాక దొంగలు తాళం పగలగొట్టి బెడ్‌రూంలోని ఓ పెట్టేలో ఉన్న 18 తులాల వెండి పట్టీలు, రూ.10వేల ఎత్తుకెళ్లారు. అదే గ్రామంలో శ్రీనాథ్ గౌడ్ ఇంట్లో కూడా రూ.10వేలు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రోడ్డు ప్రమాదాల నివారణ

ప్రతి ఒక్కరి బాధ్యత

● గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గజ్వేల్, ఆగస్టు 26: రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి తెలిపారు. గజ్వేల్‌లోని ఆయా చౌరస్తా ల్లో సోమవారం గజ్వేల్ సీఐ బి.సైదాతో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించని, నంబర్ ప్లేట్ లేని 42 వాహనాలపై, మూడు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడం అందరి బాధ్యత అని చెప్పారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వారి వెంట అదనపు సీఐ ముత్యంరాజు, ఎస్ఐలు శంకర్, కరుణాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, దామోదర్, చంద్రమోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



















జన్మాష్టమి వేడుకల్లో నీలం

పటాన్‌చెరు పరిధిలో సోమవారం నిర్వహించిన కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ పాల్గొన్నారు. బీరంగూడా సాయికృప కాలనీలో జన్మాష్టమి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రత్యేక పూజలు చేశారు.

- పటాన్‌చెరు, ఆగస్టు 26

కొర్వి కృష్ణస్వామి సేవలు ఎనలేనివి : పులిమామిడి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 26 : కొర్వి కృష్ణస్వామి సేవలు ఎనలేనివని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు అన్నారు. కొర్వి కృష్ణస్వామి 131వ జయంతి వేడుకలను సంగారెడ్డిలోని సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు కుటుంబంలో జన్మించిన కృష్ణస్వామి ఎంతో కష్టపడి విద్యనభ్యసించారని, చాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేసి, ముంబై వెళ్లి ఉన్నత చదువులు అభ్యసించారని గుర్తుచేశారు. హైదరాబాద్ చరిత్రపై, గోవాలో స్వాతంత్రోద్యమం తదితర అంశాలపై పుస్తకాలను రచించారన్నారు. మేయర్‌గా ఉన్న కాలంలో హైదరాబాద్‌కు మాస్టర్‌ప్లాన్ రూపొందించి నగరంపై చెరగని ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు మురళీధర్, ఉపాధ్యక్షుడు తిర్మల్‌రావు, జనార్దన్, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి కృష్ణ, కార్యదర్శి కృష్ణ, పోతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని ముదిరాజ్ సంఘం కార్యాలయంలో కొర్వి కృష్ణస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పులిమామిడి రాజు, తదితరులు

ఉలువలతో మురళీలోలుడి చిత్రం



గజ్వేల్, ఆగస్టు 26: ఉలువలతో కృష్ణుడి చిత్రాన్ని గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కృష్ణుడు బోధించిన భగవద్గీతను ప్రతీ ఒక్కరు పాటించాలని, హిందూ ధర్మ సంస్కృతీ సంప్రదాయాలను, ధర్మాన్ని మర్చిపోవద్దన్నారు.

చిత్రాన్ని చూపుతున్న రామకోటి రామరాజు

కేతకీలో శ్రావణ పూజలు



సంగమేశ్వరుడి దర్శనానికి క్యూలైన్‌లో రద్దీ

ఝరాసంగం, ఆగస్టు 26 : ప్రసిద్ధిగాంచిన శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం నాలుగో సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ఆవరణ సందడిగా మారింది. ఉదయం అమృతగుండంలో స్నానాలు ఆచరించి స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆలయ ఆవరణలో నవగ్రహాలకు తైలం, నువ్వులు, నల్లా వస్త్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారుల అన్ని ఏర్పాట్లు చేపట్టారు. మండల పరిధిలోని మాచూనూర్ శివారులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- యువకుడికి గాయాలు

రామచంద్రాపురం, ఆగస్టు 26 : రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతిచెందిన ఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 65వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. సీఐ జగన్నాథ్ కథనం ప్రకారం... లింగంపల్లి నుంచి పటాన్‌చెరువైపు వేగంగా వెళ్తున్న అశోక్‌లేలాండ్ ట్రాలీ రామచంద్రాపురం వద్ద రోడ్డు దాటుతున్న ఓ గుర్తు తెలియని మహిళ(45)ను ఢీకొన్నది. అదే సమయంలో యాక్టివాపై వెళ్తున్న అసాబ్(22)ను ఢీకొన్నది. ఈ ఘటనలో తలకు తీవ్రంగాగాయాలై మహిళ మృతిచెందగా, యువకుడి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. రోడ్డు సేఫ్టీ కానిస్టేబుల్ దశరథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రెండు కార్లు ఢీ... ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 22 : సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామ శివారులో రెండు కార్లు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసు కున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా రామగుండం పట్టణానికి చెందిన సనాహల్లా తన తండ్రి సాదత్‌హల్లా, తాత అసద్ హుల్లాతో కలిసి హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు కారులో వెళుతున్నాడు. పొన్నాల గ్రామ శివారులోని బ్రిడ్జ్ వద్దకు రాగనే ఎదురుగా రాంగ్ రూట్లో అతివేగంతో వస్తున్న కారు వారు ప్రయాణిస్తున్న కారును ఢీకొన్నది. అసద్ హుల్లాకు ఎడమ కాలు విరగగా, సాదత్‌హుల్లాకు ఛాతిలో గాయమైంది. రెండు కార్లు డామేజ్ అయినట్లు పోలీసులు తెలిపారు. రాంగ్ రూట్లో వస్తున్న దర్మారం గ్రామం పెద్దపల్లి జిల్లాకు చెందిన సత్యనారాయణపై సనాహల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని విద్యార్థికి గాయాలు



బాలుడిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న స్థానికులు

సిద్దిపేట రూరల్, ఆగస్టు 26 : రోడ్డు ప్రమాదంలో గురుకుల విద్యార్థికి గాయాలైన సంఘటన సోమవారం నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో సిరిసిల్ల-సిద్దిపేట రోడ్డుపై చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణరావుపేట గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ గుర్రాలగొంది సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. 15 రోజుల కింద దగ్గరి బంధువు చనిపోవడంతో ఇంటికి వెళ్లి సోమవారం గురుకుల పాఠశాలకు వచ్చాడు. నిత్యావసర సరుకులు తెచ్చుకునేందకు పాఠశాల నుంచి గ్రామానికి వెళ్లి రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు అతడిని కారు ఢీకొనగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మనోజ్‌కుమార్‌ను 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ఇదే విషయమై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. ఆసుపత్రికి వెళ్లి విద్యార్థి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నామని చెప్పారు. బంధువు చనిపోవడంతో 15 రోజులుగా ఇంటికి వెళ్లి రాలేదు. హాస్టల్‌కు వచ్చేముందు తల్లిదండ్రులను తీసుకుని రావాలని ముందే ఫోన్‌లో చెప్పగా, ఎలాంటి సమాచారం లేకుండా వచ్చి బ్యాగు లోపల పెట్టి తిరిగి మళ్లీ బయటకు వెళ్లాడని, ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడని తెలిపారు.

ఎలుగు బంటి దాడి.. రైతుకు తీవ్ర గాయాలు

హవేళిఘణపూర్, ఆగస్టు 25 : ఎలుగుబంటి దాడిలో ఓ రైతుకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని ధూప్‌సింగ్ తండాలో సోమవారం చోటుచేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. వాడి గ్రామ పంచాయతీ పరిధిలోని ధూప్‌సింగ్ తండాకు చెందిన కెతావత్ రవి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం ఉదయం రోజువారీ మాదిరిగానే వరి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలోనే పక్కనే ఉన్న పొదల్లోంచి ఎలుగుబంటి ఒక్కసారిగా వచ్చి రవిపై దాడి చేసింది. ఎడమ దవడ, చెవి, కాళ్లకు, తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన చుట్టుపక్కల రైతులు ఎలుగుబంటిని చెదరగొట్టగా అడవిలోకి వెళ్లింది. తీవ్రగాయాలైన రవిని మెదక్ ప్రభుత్వాసుత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం బాధితుడి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. రవికి చికిత్స నిమిత్తం రూ.10,000 ఫారెస్టు అధికారులు అందించారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



తిరుపతి(ఫైల్)

కోహెడ, ఆగస్టు 26 : పురుగుల మందు తాగి ఒకరు మృతిచెందిన ఘటన కోహెడ మండలం వింజపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నంగునూరు తిరుపతి(35) జీవనోపాధి కోసం 15 ఏళ్ల క్రితం కరీంనగర్‌కు వెళ్లాడు. అక్కడ చికెన్ సెంటర్‌లో పనిచేస్తూ భార్య భవాని, కుమారుడు శివధనుష్, కూతురు శ్రీనిత్యతో ఉంటున్నాడు. గ్రామంలో తనకు ఉన్న రెండు ఎకరాల వ్యవసాయ బావి వద్దకు వెళ్లుతున్నట్లు ఇంట్లో చెప్పి ఆదివారం కోహెడకు వచ్చారు. రాత్రి అయినప్పటికిని ఇంటికి రాకపోవడంతో పలుమార్లు భర్తకు భార్య భవాని ఫోన్ చేయగా తిరుపతి లిఫ్ట్ చేయలేదు. సోమవారం భూమిని కౌలుకు తీసుకున్న రైతు యాదగిరి వెళ్లగా తిరుపతి పురుగుల మందు తాగి పడి ఉన్నట్లు గమనించి భార్యకు, గ్రామస్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. తిరుపతి పని కోసం సౌదీ దేశానికి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ మేరకు మెడికల్ టెస్ట్‌లో ఫెయిల్ అయినట్లు, అలాగే ఉన్న అప్పులు ఎలా తీర్చాలని తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని, దీంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తిరుపతి భార్య పేర్కొన్నది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లి, కూతురు అదృశ్యం

టేక్మాల్, ఆగస్టు 26 : మండల పరిధిలో మూడు రోజుల క్రితం తల్లికూతుళ్లు అదృశ్యమైనట్లు టేక్మాల్ ఏఎస్ఐ దయానంద్ సోమవారం తెలిపారు. ఏఎస్ఐ వివరాల మేరకు... వెంకటాపూర్ గ్రామానికి చెందిన కిష్టమ్మ, దుర్గయ్య దంపతులకు ముగ్గురు కుమార్తెలు. చిన్న కుమార్తె సరస్వతి(26) భర్త రెండేళ్ల క్రితం మృతిచెందాడు. సరస్వతి తన కూతురు భార్గవితో ఈనెల 23న నర్సాపూర్ మండలం రుక్మంపేటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి కిష్టమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

శాస్త్రీయ నృత్య తోటమాలి

- ఖేడ్ చిన్నారులకు పేరిణి, క్లాసికల్ నృత్యాల్లో శిక్షణనిస్తున్న ప్రశాంత్
- ఐదు బ్యాచ్‌లలో 200 మందికి శిక్షణ
- శిష్యులతో అనేక ప్రదర్శనలు

నారాయణఖేడ్, ఆగస్టు 26 : పేరణి నృత్యం, భరత నాట్యం గురించి వినడమే తప్ప, మూరుమూల నారాయణఖేడ్ ప్రాంతంలో ఎవరికీ పరిచయం లేదు. రెండేళ్ల క్రితం నిజామాబాద్‌కు చెందిన పేరణి నృత్యకారుడు తోట ప్రశాంత్ ఖేడ్‌లో పేరణి లాస్యం, తాండవం, క్లాసికల్ డ్యాన్సులలో శిక్షణ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. తనకు వచ్చిన శాస్త్రీయ నృత్య రీతులను నలుగురికి నేర్పుతూ కళను సంరక్షించే తోటమాలిగా నిలుస్తున్నాడు.

పట్టణంలోని సాయిబాబా ఆలయంలోని ధ్యాన మందిరంలో చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు ఐదు బ్యాచ్‌లలో 200 మంది వరకు శిక్షణ పొందారు. ప్రోత్సహించేవారు ఉంటే.. ఏ రంగలంలోనైనా రాణిస్తామని నారాయణఖేడ్ చిన్నారులు నిరూపిస్తున్నారు. చిన్నారులు షిర్డీ, తిరుపతి, వేములవాడ క్షేత్రాలతో పాటు హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, లలిత కళాతోరణం, త్యాగరాయగానసభ, రవీంద్రభారతి తదితర చోట్ల అనేక ప్రదర్శనలు ఇచ్చి, ప్రశంసలు పొందారు. ఖేడ్ ప్రాంతంతో పాటు ఎక్కడ ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగిన చిన్నారులు పాల్గొంటున్నారు. ఇంకా అనేక మంది నృత్యంలో శిక్షణ పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు.





వేములవాడలో శివరాత్రి పర్వదినాన ప్రదర్శన ఇచ్చిన తోట ప్రశాంత్ బృందం, పేరణి నృత్య భంగిమలో తోట ప్రశాంత్

8వ తరగతి నుంచే నృత్యంపై ఆసక్తి

8వ తరగతి నుంచే నృత్యం పట్ల ఆసక్తి కనబరిచాను. నా సోదరుల ప్రోత్సాహంతో గురువు డాక్టర్ కళాకృష్ణ, పేరణి ప్రకాష్, టంగుటూరి బీమన్‌పటేళ్ల వద్ద శిక్షణ పొందాను. పేరణి లాస్యం, తాండవం, క్లాసికల్ డ్యాన్సులలో శిక్షణ పొంది హర్యానా, ఢిల్లీ, కేరళ, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చాను. ప్రస్తుతం నా అభిరుచికి అనుగుణంగా నిజామాబాద్, నారాయణఖేడ్, హైదరాబాద్‌లలో చిన్నారులకు శిక్షణ ఇస్తున్నాను.

- తోట ప్రశాంత్, పేరణి నృత్యం శిక్షకుడు

150 మందితో కూచిపూడి నృత్య ప్రదర్శన

వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 26 : ఒకేసారి 150 మంది కూచిపూడి కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చి వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నారు. సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో ఆదివారం సాయంత్రం నటరాజ స్ఫూర్తి డ్యాన్స్ అకాడమీ, వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో నృత్య ప్రదర్శన ఇచ్చి వండర్ బుక్‌లో నమోదయ్యారని సంస్థ ప్రతినిధులు బింగి నరేందర్‌గౌడ్, అరుణ్‌కుమార్ తెలిపారు. మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు తోపాజి అనంతకిషన్ మాట్లాడుతూ పట్టణంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న సంస్థలకు కళామతల్లికి కూడా సేవ చేసుకునే భాగ్యం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాల కృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు రామప్ప, ప్రదీప్, నాగరాజు, మా ఇల్లు సంస్థ ప్రతినిదులు పాల్గొన్నారు.



పురస్కారం అందజేస్తున్న మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు తోపాజి అనంతకిషన్

స్థానిక సంస్థ ఎన్నికల్లో అధిక స్థానాలు సాధించాలి

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



రఘునందన్‌రావుతో అరుణ్‌కుమార్‌రెడ్డి

ములుగు, ఆగస్టు 26 : స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాలు సాధించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సోమవారం ములుగు మండలానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు చింతల అరుణ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లో ఎంపీ రఘునందన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట మండల కోకన్వీనర్ సత్యంయాదవ్, క్రాంతి, అభిషేక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

కంఠంలో ఊపిరి ఉన్నంత వరకు మరువను

- రామాయంపేటలోనే రాజకీయ ఓనమాలు నేర్చుకున్నా
- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

రామాయంపేట, ఆగస్టు 26 : నా కంఠంలో ప్రాణమున్నంత వరకూ మీ కోసమే పని చేస్తా.. మిమ్మల్ని మరువనని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. రామాయంపేట మండలం కోనాపూర్ పెద్దతండాలో సోమవారం సేవాలాల్, జగదాంబ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న మైనంపల్లికి బంజారా మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను రామాయంపేటలోనే రాజకీయ ఓనమాలు నేర్చుకున్నానన్నారు. తమ కుటుంబం ప్రజాసేవలో ఆస్తులు దార పోసేందుకు వెనుకాడదన్నారు. ఇప్పటికే సొంత నిధులతో బోర్లు వేయించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబం ఎన్ని కుట్రలు చేసినా మీ ఆశీర్వాదంతో తన కుమారుడు రోహిత్ ఎమ్మెల్యేగా గెలిచాడన్నారు. ఈ ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు తెస్తామని మైనంపల్లి ప్రకటించారు. ఆయన వెంట టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతారావు,రాష్ట్ర నాయకులు పల్లె రామచంద్రగౌడ్, మాజీ ఎంపీపీ రమేష్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చప్పెట ముత్యంరెడ్డి, కౌన్సిలర్లు దేమే యాదగిరి, సుందర్‌సింగ్ ఉన్నారు.



మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

డంపింగ్‌యార్డులు నిరుపయోగం

- వృథాగా సెగ్రిగేషన్ షెడ్లు

కొండాపూర్, ఆగస్టు 26 : గ్రామాల్లో నిర్మించిన డంపింగ్‌యార్డు, సెగ్రిగేషన్ షెడ్ల ప్రక్రియ నిర్మాణాలకే పరిమితమయ్యాయి. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, ఎరువులను తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని భావించగా నిరుపయోగంగానే మిగిలాయి. 500 మంది జనాభాకు ఒక వ్యక్తిని నియమించి, రిక్షాను కేటాయించి ఇంటింటికీ తిరిగి వ్యర్థాలను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలి. గదుల్లో వ్యర్థాలను విభజించి వివిధ పద్ధతుల్లో వేరు చేసి సేంద్రియ ఎరువులను తయారు చేయాలి. వాటి నుంచి తయారైన ఎరువులను విక్రయించి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధి కోసం వినియోగించాలని లక్ష్యం. దీంతో గ్రామాల్లో పారిశుద్యం, స్వచ్ఛత చేకూరుతుందని రెండు విధాలుగా పంచాయతీలకు లాభమనుకున్నారు. కానీ, ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదు. మండల పరిధిలో 24 పంచాయతీల్లో షెడ్లు, తొట్లు నిర్మించి, చెత్తను సేకరించేందుకు రిక్షాలను కూడా తీసుకొచ్చారు. అవన్నీ మూలన పడి వెక్కిరిస్తున్నారు. ప్రభుత్వ నిధులన్నీ వృథాగా మారాయి. సేకరించిన చెత్తను పర్యావరణానికి హానీ కలిగేలా ఎక్కడపడితే అక్కడ డంపింగ్ చేసి కాల్చుతున్నారు. చెత్తతో పాటు ప్లాస్టిక్ వస్తువులను కాల్చడం ద్వారా వాతావరణం కాలుష్యం అవుతుంది. ఆహార వ్యర్థాల కోసం కుక్కలకు డంపింగ్ చేసిన దగ్గర గుమిగూడి అటుగా వచ్చిన వారిని బెంబేలెత్తిస్తున్నాయి.

ప్రతీ రూపాయి గ్రామాభివృద్ధికి తోడ్పడాలి

ప్రజల సొమ్మును దుర్వినియోగం పరిచడం సరికాదు. ఐదేళ్ల క్రింతం నిర్మాణాలు చేపట్టి వృథాగా ఉంచారు. డంపింగ్‌యార్డుల ద్వారా ప్రయోజనం లేకుండా పోయింది. వాటిని వినియోగంలోకి తీసుకురావాలి.

- రాజయ్య, సీపీఎం రైతు సంఘం నాయకుడు

చెత్త సేకరణ అమల్లో ఉంది

ప్రతీ గ్రామంలో చెత్త సేకరణ జరుగుతుంది. సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేసి హరితహారంలో నాటిన మొక్కలకు వేశాం. గ్రామ స్థాయిలో పర్యవేక్షించి అమల చేసేందుకు కృషి చేస్తున్నాం.

- శ్రీనివాస్, ఎంపీవో





కొండాపూర్ పంచాయతీలో మూలనపడిన రిక్షాలు



తమ్మలిబాయ్ తండాల్లో నిర్మాణానికి పరిమితమైన సెగ్రిగేషన్ షెడ్డు, తెర్పోల్‌లో డంపింగ్‌యార్డులో చెత్త

అక్రమంగా తరలిస్తున్న 38 క్వింటాళ్ల బియ్యం సీజ్



పట్టుకున్న బియ్యంతో సీఐ, ఎస్ఐ

మర్కుక్, ఆగస్టు 26: అక్రమంగా తరలిస్తున్న 38 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసిన ఘటన మర్కుక్ మండల పరిధిలో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీడీఎస్ బియ్యాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండల పరిధిలోని పుట్టగూడెం గ్రామానికి చెందిన మాలోత్ నవీన్ మినీ వ్యాన్‌లో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నర్సన్నపేట వద్ద గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ దామోదర్ వాహనాన్ని పట్టుకున్నారు. 38 క్వింటాళ్ల రేషన్‌బియ్యంతో పాటు మినీవ్యాన్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

78 కేజీల ఎండు గంజాయి పట్టివేత

మునిపల్లి, ఆగస్టు 26 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తుని నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న 78 కేజీల ఎండు గంజాయిని సోమవారం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. తుని నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌కు టాటా సఫారీలో అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో సంగారెడ్డి, మెదక్ డివిజన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు సోమవారం ఆ శాఖ సీఐ గాంధీనాయక్ ఆధ్వర్యంలో కంకోల్‌టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. 78కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడు అష్రఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు.


సిద్దిపేట కల్చరల్: పూజల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు దంపతులు


చేర్యాలలో వాసవీగార్డెన్స్‌లో నిర్వహించిన వేడుకల్లో ప్రత్యేక వేషధారణలో చిన్నారులు


మిరుదొడ్డిలో కృష్ణుడి, గోపికల వేషధారణలో చిన్నారులు


హుస్నాబాద్ టౌన్: శిశుమందిర్‌లో గోపిక, కృష్ణుల వేషధారణలో చిన్నారులు

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

సిద్దిపేట జిల్లావ్యాప్తంగా సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపిక, రుక్మిణీ, సత్యభామ, గొల్లభామ వేషధారణలతో అలంకరించారు. సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.


వేడుకలకు హాజరైన భక్తులు


కృష్ణయ్య వేషధారణలో చిన్నారులు


కోహెడ: నకిరకొమ్ములలో శ్రీకృష్ణుడి వేషధారణలో బాలుడు


మర్కుక్: స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం


సిద్దిపేట రూరల్: ఇర్కోడు ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వంశీధర్ రావు


గజ్వేల్‌లోని శ్రీకృష్ణాలయంలో జన్మాష్టమి వేడుకల్లో మునిసిపల్ చైర్మన్ రాజమౌళి


తొగుట: వెంకట్రావ్‌పేట లిటిల్ బర్డ్ స్కూల్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు

సమాచారం

అనుమానిత వ్యక్తులను ముందస్తుగా గుర్తించాలి: సీఐ

దౌల్తాబాద్, అఆగస్టు 26: ప్రభుత్వ అనుమతి లేని అక్రమ రవాణాను, అనుమానిత వ్యక్తులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. సోమవారం దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో నాకాబందిపై పోలీస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తుల, సంఘవిద్రోహ శక్తుల, అపరిచిత వ్యక్తుల వివరాలను ముందస్తుగా సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ వరం: కిరణ్‌కుమార్

ధూళిమిట్ట, ఆగస్టు 26: పేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని బెక్కల్, బైరాన్‌పల్లి గ్రామాల్లో పలువురు లబ్ధిదారులకు రూ.1,50,000 వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి నిరంతరం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బెక్కల్ దేవస్థానం చైర్మన్ చొప్పరి మల్లేషం, మండలాధ్యక్షురాలు చల్ల లతారెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు ఎర్ర కిష్టయ్య, మండల కోశాధికారి లకావత్ కిషన్, గ్రామశాఖ అధ్యక్షుడు కొలిపాక ఉపేందర్, ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు నాచగోని రితేష్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

కోహెడ, ఆగస్టు 26: నూతన సాంకేతిక పరిజ్ఞానం(సీఈఐఆర్)తో పోగొట్టుకున్న ఫోన్‌ను కోహెడ పోలీసులు సోమవారం వెతికి పట్టుకున్నారు. మండలంలోని బస్వాపూర్‌కు చెందిన వరుకోలు కృష్ణ ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్ ఉపయోగించి పోయిన సెల్‌ఫోన్‌ను వెతికి పట్టుకున్నారు. సోమవారం బాధితుడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ అభిలాష్ అందజేశారు.

'బీజేపీ సభ్యత్వ నమోదు పండుగలా జరగాలి'

మెదక్ అర్బన్, ఆగస్టు 26: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో నిర్వహించాలని, మెదక్ జిల్లాలో అత్యధిక సభ్యత్వాలు అయ్యే విధంగా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు మురళీ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యశాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి రాజశేఖర్, పరిణీత, మురళీయాదవ్ రఘువీరారెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీలు

రామాయంపేట, ఆగస్టు 26 : రామాయంపేటలో మంగళవారం అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీలు జరుగనున్నాయి. క్రీడా దినోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు బొంతల సత్యం తెలిపారు.

రహదారి విస్తరణ పనులను పూర్తి చేయించాలి

● మంత్రికి తంగళ్లపల్లి గ్రామస్థుల వినతి

కోహెడ, ఆగస్టు 26: మండలంలోని శనిగరం, తంగళ్లపల్లి గ్రామాల్లో రహదారి వెడల్పు విస్తరణ పనులు కాకపోవడంతో గ్రామస్థులకు ఇబ్బందిగా ఉన్నదని, వెంటనే పనులను పూర్తి చేయించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తంగళ్లపల్లి గ్రామస్థులు సోమవారం హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చెప్యాల అశోక్ సిద్దిపేట నుంచి తంగళ్లపల్లికి ఆర్టీసీ బస్సులో వస్తుండగా బస్సుకు ప్రమాదం జరగడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రస్తుతం అతడు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, అతడికి మెరుగైన వైద్యమందించాలని మంత్రిని కోరారు. అలాగే ఆర్టీసీ నుంచి ఆర్థిక సాయం అందచేసి ఆదుకోవాలని కోరినట్లు చెప్పారు. హుజూరాబాద్ నుంచి శనిగరం వరకు రహదారి వెడల్పు విస్తరణ పనులు జరిగినా.. తంగళ్లపల్లి, శనిగరం గ్రామాల్లో కాలేదన్నారు. మంత్రి అప్పటికప్పుడు స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి రేపటి నుంచి పనులు ప్రారంభించాలని ఆదేశించినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు బి.నారాయణ, పాము శ్రీకాంత్, మునీ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.


మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన తంగళ్లపల్లి గ్రామస్థులు

కావేరీ కంపెనీకి ఇచ్చిన ప్రభుత్వ భూమిని వెనక్కి తీసుకోవాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య

గజ్వేల్, ఆగస్టు 26: కావేరీ కంపెనీకి ఇచ్చిన ప్రభుత్వ భూమిని వెనక్కి తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కుక్ మండలం పాములపర్తి గ్రామ పరిధిలోని మధిర గ్రామమైన బండలు గ్రామంలోని సుమారు 30 ఎకరాల భూమిని కావేరీ కంపెనీకి అప్పటి ప్రభుత్వం కట్టబెట్టిందని, దీని విలువ సుమారు రూ.100 కోట్లు ఉంటుందన్నారు. కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టుకు ఆనుకుని ఉన్న ఈ భూమిలో ప్రారంభంలో 50 కుటుంబాలు, తర్వాత 30 కుటుంబాలు వ్యవసాయం చేసుకుని నివసించేవన్నారు. కావేరీ పరిశ్రమ నిర్మాణంతో ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున మట్టిని తీసుకువచ్చి పోయడంతో గ్రామం మొత్తం నీటిలో మునిగిపోయేదన్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో కావేరీ సీఎస్ఆర్ ఫండ్స్‌తో నిర్మించిన ఇళ్లు ఉన్న భూమి సైతం అసైన్డ్ భూమి అని, కావేరీ పరిశ్రమకు గత ప్రభుత్వం అప్పగించిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని ప్రజావసరాలకు ఉపయోగించాలన్నారు.

ప్రమాదానికి కారణమైన వాహనం గుర్తింపు

● బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి అరెస్ట్

వర్గల్, ఆగస్టు 26: వర్గల్ మండలం గౌరారం రాజీవ్ రహదారి రోడ్డు పక్కన బైక్ ఆపిన వ్యక్తిని ఢీకొట్టి పారిపోయిన బొలెరో వాహనాన్ని పోలీసులు సోమవారం గుర్తించారు. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఈనెల 18న గౌరారం రాజీవ్ రహదారి సెవెన్ హిల్స్ హోటల్ వద్ద రాత్రి సమయంలో ములుగు మండల కేంద్రానికి చెందిన ఎర్రన్న కనకయ్య(38) రోడ్డు పక్కన బైక్ ఆపుతుండగా వెనకనుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో కనకయ్యకు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 20న మృతిచెందాడు. దీంతో గుర్తు తెలియని వాహనంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ప్రమాదం చేసి ఆపకుండా వెళ్లిన వాహనాన్ని గుర్తించడం కోసం సిద్దిపేట, ప్రజ్ఞాపూర్, గజ్వేల్, గౌరారం, అలియాబాద్ చౌరస్తా, ఓఆర్ఆర్ టోల్‌గేట్ వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ప్రమాదానికి బొలెరో వాహనం కారణమని, వాహనం నడిపిన వ్యక్తి బీహార్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్‌గా పోలీసులు గుర్తించి, కేసు నమోదు చేశారు. అనంతరం బీహార్‌లో ఉన్న రాజ్‌కుమార్‌ను ఇక్కడికి రప్పించి అరెస్ట్ చేశారు. చాకచక్యంగా కేసును ఛేదించిన ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, పోలీస్ సిబ్బందిని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి అభినందించారు.


ప్రమాదానికి కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

నేడు గోకులాష్టమి వేడుకలు


ముస్తాబైన వేణుగోపాలస్వామి ఆలయం

వర్గల్, ఆగస్టు 26: వర్గల్ వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం జరిగే గోకులాష్టమి వేడుకలకు ఆలయ ప్రాంగణం ముస్తాబైంది. ఈ సందర్భంగా రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయానికి రంగులతో మెరుగులు దిద్దారు, కొబ్బరిమట్టలు, మామిడి తోరణాలతో అలంకరింపజేశారు. ఉదయం భగవద్గీత పారాయణం, విష్ణుసహస్రనామ పారాయనములు, ఆరాధన, బాలభోగం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వేదపండితుడు మురళీధరచార్యులు తెలిపారు. 51 రకాల స్వీట్స్‌తో నివేదన, తీర్థ ప్రసాదగోష్టి, అన్నప్రసాదల వితరణ ఉంటుందన్నారు.

జూట్ బ్యాగ్ తయారీపై అవగాహన

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 26: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో జూట్ బ్యాగు తయారీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జూట్ లంచ్ బ్యాగ్, పౌచ్, ఫోల్డర్, లగేజ్, ల్యాప్‌ట్యాప్ బ్యాగులు తయారీ గురించి గ్రామస్థులకు వివరించి సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. జూట్ బ్యాగుల తో కలిగే లాభాలను ఈ సందర్భంగా నిర్వాహకులు వివరించారు.

త్వరలో మాదిగల ఆత్మీయ సమ్మేళనం

హుస్నాబాద్, ఆగస్టు 26: త్వరలో హుస్నాబాద్ పట్టణంలో నియోజకవర్గ స్థాయి మాదిగల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామని దళిత సంఘాల నాయకులు ముక్కెర సంపత్‌కుమార్ తెలిపారు. సోమవారం రాత్రి హుస్నాబాద్ పట్టణంలో మాదిగల ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇచ్చిన సందర్భంగా దీనిని విస్తృతంగా ప్రచారం చేయడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సమ్మేళనం సందర్భంగా వెయ్యి డప్పులతో భారీ ర్యాలీ జరుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బత్తుల చంద్రమౌళి, గాదెపాక రవీందర్ పాల్గొన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 26: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల(టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్)లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.దుర్గారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు మంగళవారం కళాశాలకు రావాలని పేర్కొన్నారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో ఎస్సీ 20, ఎసీ-సి 1, ఎస్టీ-2, బీసీ-1, మైనార్టీ-1, బైపీసీ మొదటి సంవత్సరంలో ఎస్సీ-17, ఎస్సీ-సి 1, బీసీ-2, మైనార్టీ-1 సీట్లు ఖాళీలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కులం పేరుతో దూషిస్తే కఠిన చర్యలు: సీఐ


గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

మర్కుక్, ఆగస్టు 26: కులం పేరుతో దూషిసేత ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని గౌరారం రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. మర్కుక్ మండల పరిధిలోని శివారు వెంకటాపూర్ గ్రామంలో దళితులకు ఆలయ ప్రవేశం లేదని, మాతో పాటు బోనాలు మీరు ఎలా తీస్తారని దళితులను బోనాలు తీయకుండా అడ్డుకున్న గ్రామ బీసీ కులస్తులపై దళితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం సీఐ మహేందర్‌రెడ్డి, మర్కుక్ ఎస్ఐ దామోదర్‌తో కలిసి గ్రామాన్ని సందర్శించారు. అనంతరం అన్ని వర్గాల కుల పెద్దలతో చర్చలు జరిపి మాట్లాడారు. గ్రామ దేవతలకు కులాలతో సంబంధం లేకుండా బోనాలు నిర్వహించుకోవచ్చన్నారు.

సిద్దిపేట ఏబీసీ సెంటర్‌కు వీధికుక్కల తరలింపు

హుస్నాబాద్, ఆగస్టు 26: హుస్నాబాద్ పట్టణలోని వీధి కుక్కలను సోమవారం సిద్దిపేటలోని ఏబీసీ (ఎనిమల్ బర్త్ కంట్రోల్) సెంటర్‌కు తరలించారు. వీధి కుక్కలకు ఏబీసీ సెంటర్‌లో సెర్టిలైజేషన్ ఆపరేషన్ చేసిన నాలుగురోజుల తరువాత వాటిని ఎక్కడి నుంచి తీసుకెళ్లారో మళ్లీ అక్కడే విడిచిపెడుతారని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ అయిలేని అనిత మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు భాగ్యరెడ్డి, షన్న లావణ్య, మ్యాదరబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చేర్యాల-నర్సాయపల్లి దారి

● వరుస ఘటనలతో ప్రయాణికుల భయాందోళనలు

చేర్యాల, ఆగస్టు 26: చేర్యాల-నర్సాయపల్లి ప్రధాన రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈదారి వెంబడి నర్సాయపల్లి మీదుగా హుస్నాబాద్, తరిగొప్పుల, హన్మకొండకు ప్రయాణిస్తున్నారు. చాలాఏళ్ల క్రితం రోడ్డు వేయడంతో పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. పట్టణ శివారులో తాటివనాల సమీపంలో ఓ మూలమలుపు వద్ద రోడ్డు పక్కన వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉన్నది. అంతేకాకుండా దారివెంట పిచ్చి, తుమ్మ చెట్లు విస్తరించడంతో ఎదురుగా వస్తున్న వాహనం సరిగా కనిపించకపోవడంతో బావి మూల మలుపు వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొద్దిరోజుల కితం ఓ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు మృతిచెందాడు. తాజాగా అదే ప్రదేశంలో బొలెరో ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడిక్కడే దుర్మరణం పాలవగా, మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. గతంలోనూ పలు ప్రమాదాలు చోటు చేసుకున్నా.. సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. చేర్యాల పట్టణ శివారు నర్సాయపల్లి వరకు విస్తరించడం, పలు కంపనీలు, మిల్లులు, తోటలు ఏర్పాటవుతున్నాయి. అంతేకాకుండా వ్యవసాయ భూములకు వెళ్తున్న వారితో పాటు ఈదారి వెంటవాహనాల రాకపోకలు పెరుగుతుండటంతో రద్దీ నెలకొంటుంది. సంబంధిత అధికారులు చొరవ వహించి బ్లాక్‌స్పాట్‌గా గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా మారిన చేర్యాల-నర్సాయపల్లి దారి


పట్టణ శివారులో రోడ్డుపక్కన ప్రమాదకరంగా నీళ్లబావి

'వాల్మీకి స్కాంపై విచారణ జరిపించాలి'

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 26: వాల్మీకి స్కాంపై విచారణ జరిపించి, నిధుల మళ్లింపు వ్యవహారంలో తెలంగాణకు న్యాయం జరిగేలా చూడాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెమ్మసారం శ్రావణ్ కోరారు. సోమవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ వాల్మీకి స్కాంను పక్కదోవ పట్టించడానికి హైడ్రా పేరిట కొత్త వివాదానికి తెరలేపారని అన్నారు. కర్ణాటకలో జరిగిన స్కాంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకుల పాత్ర కీలకంగా ఉందని ఆరోపించారు. వాల్మీకి స్కాంపై మీడియాలో చర్చలు జరగకుండా నాయకులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా పూర్తి విచారణ జరిపి తెలంగాణకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు.

విద్యుత్ ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

● టీజీఎస్‌పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ టీఆర్ చంద్రమోహన్

సిద్దిపేట టౌన్, ఆగస్టు 26: విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న విద్యుత్ భవన్‌లో ఈనెల 27న సీజీఆర్ఎఫ్ (కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రీడ్రెసెల్ ఫోరం)ను హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించనునట్లు సిద్దిపేట జిల్లా ఎస్ఈటీఆర్ చంద్రమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి హాజరయ్యే వినియోగదారులు కరెంట్ బిల్లు రసీదు, ఆధార్‌కార్డు తీసుకొని రావాలని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి 1.30 గంటల వరకు నిర్వహించనునట్లు తెలిపారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు పంచాలి

● సీపీఐ రాష్ట్ర నాయకుడు భట్టు దయానందరెడ్డి

గజ్వేల్, ఆగస్టు 26: ఆయా గ్రామాల్లో గత ప్రభుత్వం నిర్మించి, అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను గ్రామాల్లోని పేదలకు పంచాలని సీపీఐ రాష్ట్ర నాయకులు భట్టు దయానందరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గజ్వేల్ పట్టణంలో సోమవారం అయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అయా గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్లు పలుచోట్ల పిల్లర్ల స్థాయిలో, మరికొన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్నాయని, ప్రస్తుతం అవి పూర్తిగా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయని, వాటిని గ్రామాల్లో ఇంటి స్థలాలు లేని పేదలను గుర్తించి ఇవ్వాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులు

కొండపాక, ఆగస్టు 26: కొండపాక మండలం సిరిసినగండ్ల ఉన్నత పాఠశాలలో 2008-09లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. దాదాపు 15 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. నాడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువా, మెమొంటోలతో సన్మానించారు.

చెరువు శిఖంలోని అక్రమ నిర్మాణాలను తొలగించాలి

● సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్

చేర్యాల, ఆగస్టు 26: చేర్యాల మండలం నాగపురి రెవెన్యూ పరిధిలోని కొండపోచమ్మ చెరువు శిఖంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలు కూల్చివేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగపురి గ్రామ సర్వే నంబరు 831లోని కొండపోచమ్మ చెరువు 22.02 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు అక్రమార్కులకు అండగా నిలిచి అక్రమ కట్టడాలు చేయించారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువుశిఖం కబ్జాచేసి చేపట్టిన నిర్మాణాలను కూల్చేయాలని కోరారు. లేనియెడల సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పూటకో పార్టీలు మారేవారికి రైతుల కష్టాలెలా తెలుస్తాయి: సీపీఎం

చేర్యాల, ఆగస్టు 26: వ్యక్తిగత స్వార్థాల కోసం పూటకో పార్టీలు మారేవారికి రైతుల కష్టాలు తెలియవని, రైతు రుణమాఫీ చేయకుండానే కాంగ్రెస్ సంబరాలు చేయడమేంటని ప్రశ్నించిన సీపీఎంపై విమర్శలు చేయడం తగదని సీపీఎం చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో అన్నారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులందరికీ రుణమాఫీ కాలేదని నిరూపిస్తామని, వాస్తవ పరిస్థితులు తెలుసుకోలేక పలువురు కాంగ్రెస్ నాయకులు అవివేకంతో మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ నేతలు చెప్పిన ఊరికి రావడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సీపీఎంను విమర్శిస్తే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాళ్లబండి నాగరాజు, బోయిని మల్లేశం, రాళ్లబండి భాస్కర్, నర్సింహులు పాల్గొన్నారు.

సీసీఆర్టీ వర్క్‌షాపునకు ఉపాధ్యాయుడు

హుస్నాబాద్, ఆగస్టు 26: ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 5వ తేదీవరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో 'చారిత్రక, సాంస్కృతిక సంరక్షణలో పాఠశాలల పాత్ర' అనే అంశంపై జరిగే సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్) వర్క్‌షాపునకు హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆంగ్లం ఉపాధ్యాయులు పంజ రాజమల్లు హాజరుకానున్నారు. రాజమల్లు గౌహతి వర్క్‌షాపునకు హాజరవుతుండటం పట్ల ఎస్‌సీఈఆర్‌టి రాష్ట్ర డైరెక్టర్ గాజుల రమేశ్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో దేశిరెడ్డి, హెచ్‌ఎం వాసుదేవరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.


ఉపాధ్యాయుడు రాజమల్లు

కుకునూరుపల్లిలో గ్రామ దేవతలకు బోనాలు


పోచమ్మకు బోనాలు సమర్పించిన ఆర్యవైశ్య సంఘం మహిళలు

కుకునూరుపల్లి, ఆగస్టు 26: మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రావణమాసం పురస్కరించుకొని కుకునూరుపల్లి గ్రామంలోని పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి సామూహిక బోనాలు సమర్పించారు. అనంతరం సామూహిక వన భోజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కాసం నవీన్‌కుమార్, జిల్లా పాండురంగం గంగిశెట్టి పాండురంగం, గంగిశెట్టి పాండురంగం, గంగిశెట్టి రాజ్‌కుమార్, కాపర్తి స్రవంతి పాల్గొన్నారు.

హుస్నాబాద్ మొదటి ఎంపీపీ మృతి

హుస్నాబాద్, ఆగస్టు 26: మండల వ్యవస్థ ఏర్పడిన తరువాత 1987లో హుస్నాబాద్ ఎంపీపీగా ఎన్నికైన తాడ సత్యనారాయణ(80) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. హుస్నాబాద్ పట్టణానికి చెందిన సత్యనారాయణ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ క్రియాశీల పాత్ర పోషించారు. అనంతరం 1999లో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. సత్యనారాయణకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం తెలిపారు.


సత్యనారాయణ (ఫైల్)

'మాలల ఐక్యతను తట్టుకోలేక మందకృష్ణకు మతిభ్రమించింది'

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 26: మాల మేధావులందరూ మనువాదులే అని మందకృష్ణ వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మద్దెల నర్సింహులు అన్నారు. సోమవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. దళిత ఐక్య ఉద్యమాలకు మాలలందరూ ఏకమై పోరాటం చేస్తుంటే తట్టుకోలేక మందకృష్ణ మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. మాల, మాదిగలు కలిసి కొట్లాడితేనే రిజర్వేషన్లు ఇప్పటికీ కొనసాగుతున్నాయని గుర్తుచేశారు. వర్గీకరణ శాస్త్రీయంగా కాకుండా అశాస్త్రీయంగా జరిగింది కనుక రాజ్యాంగబద్ధంగానే పోరాటాల ద్వారా అడ్డుకుంటామన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీరాములు, దేవయ్య రాజు, శ్రీనివాస్, సత్తయ్య, అల్లిబిల్లి నర్సింగ్‌రావు, సత్యనారయణ, మల్లేశం పాల్గొన్నారు.